# రెండు నాల్కల వ్యక్తులు

యం. దీపలక్ష్మి

ప్రతివారూ తమ ఇల్లు, తమ ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటారు. తమకు కష్టాలు, నష్టాలు కావాలని ఎవరూ కోరుకోరు, ఎవరి కంట్లో వారు కారం చల్లుకోరు, కాని ఎదుటివాని కంట్లో మాత్రం కారం చల్లడానికి ముందుకొస్తారు చాలామంది, ఉపకారం చేయడానికి వెనుకాడే వారు కొందరైతే అపకారం చేయడానికి ఉత్సాహపడేవారు చాలామంది వున్నారు నేటి సమాజంలో.

మారుతున్న నేటి సమాజంలో మనిషి యొక్క ప్రవర్తన చిత్ర విచిత్రంగా మలుపు తిరుగుతోంది, బాధ్యతగల కుర్చీలో కూర్చొని కొన్ని సవరణలు



చేస్తే, బాధ్యత లేని కుర్చీలో కూర్చున్నవాడు వ్యతిరేకిస్తాడు, అలా వ్యతిరేకించిన వ్యక్తి తిరిగి బాధ్యతగల కుర్చీ కెళ్తే మాత్రం తాను వ్యతిరేకించిన పనినే సమర్ధిస్తాడు. దీనినే గాలి వాటం అంటారు. ఇలా ప్లేటు ఫిరాయింపు వ్యక్తి రెండు నాల్కల మనిషిగా పిలువబడుతాడు. ఇట్టివారే సమాజానికి చీడ పురుగులు, మరికొందరు స్వార్ధానికి స్నేహం చేస్తారు. పొగుడుతారు, పూల మాలలు వేస్తారు, శాలువలు కప్పి సన్మానిస్తారు. తమ పనులు పూర్తి కాగానే మరుక్షణం కనిపించరు, మరికొందరు తమ పని కాకపోతే పూలమాల అనవసరంగా వేశామని డబ్బు దండుగ చేశామని అంత వరకు పొగిడిన నోటితోనే తిట్ల వర్షం కురిపిస్తారు. ఆ క్షణం వరకు కనిపించని దోషాలు తన పని నెరవేర్చని మరు క్షణం కనిపిస్తాయి కాబోలు, ఇట్టివారు చాలా ప్రమాదకరమైన వ్యక్తులు, 'అందితే జుట్టు, అందకపోతే కాళ్లు' అనే సామెత వీరి వల్లే వచ్చింది.

ఈ మధ్య మా నాన్నగారి స్నేహితుడు ఒక ఐ.ఏ.యస్. ఆఫీసర్ గారు మా ఇంటికొచ్చారు, మాటల మధ్యలో ప్రస్తుత సమాజంలోని మానవుల స్వభావాన్ని గురించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. ఆ ఆఫీసర్ గారు తన అనుభవాన్ని ఇలా వివరించారు, ఒక వ్యక్తి తను ఉద్యోగంలో ఉండగా అనేక పనుల కోసం వచ్చి తన పనులను చక్కదిద్దుకున్నాడు. తను కనిపిస్తే ఛాలు 'దండాలు, నమస్కారాలు' అని వంగి వంగి పెట్టేవాడు. ఒకనాడు ఆ వ్యక్తి యధాప్రకారం కనిపించాడు, "నేను రిటైరయ్యాను" అని చెప్పాను. అంతే మరుక్షణం మాయమయ్యాడు, కనీసం పలకరింపు కూడా లేదు, వెళ్లి వస్తానని కూడా చెప్పకుండా దాటుకున్నాడు ఆ ఘనుడు.

మేలు చేసిన వానికే కీడు చేయువారు కొందరు, మేలు చేసిన వానిని మరచువారు మరి కొందరు, అనవసరంగా విరోధం పెంచుకునేవారు కూడా వున్నారు. ఏ సహాయం ఆశించక సహృదయంతో ఆప్యాయతను అందించిన వారిని కూడా నా అనుభవంలో చూశానని ఆ ఆఫీసర్ గారు విశదపరచారు.

మంచి - చెడు రెండూ కలిసిన ఈ సమాజంలో హంసవలె మంచిని గ్రహించి, చెడుని వదిలెయ్యాలని, దుర్మార్గుని చూచి 'అయ్యో ఈ వ్యక్తి అనవసరంగా అధోగతి పొందుతున్నాడే' అని జాలి




పడాల్సిందే తప్ప అతని యందు విరోధాన్ని పెంచుకోవడం సంస్కార వంతుల లక్షణం కాదు.

ప్రతి వ్యక్తిలో అంతో ఇంతో, కొంతో మంచి గుణాలు ఉండక పోవు. వాటిని పెంపొందించి, అభివృద్ధి పరచడానికి శక్తి వంచన లేకుండా తోడ్పడితే ఈ సమాజం చాలా వరకు బాగుపడుతుంది. ప్రయత్నిస్తే ఈ విధమైన రెండు నాల్కల వ్యక్తులను ఒకే నాలుక గల వ్యక్తిగా తీర్చిదిద్దవచ్చు. ❋

## సమ్‌సారమ్ — బాబు

